క్లుప్తంగా

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

గూడూరు: పట్టణంలోని పడమర బీసీ కాలనీ, 18వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

రోడ్డు నిర్మించాలి

గూడూరు: గూడూరు – కోడుమూరు రోడ్డును వెంటనే నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని చనుగొండ్ల గ్రామంలో సీపీఎం నాయకులు రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కోడమూరు కార్యదర్శి జె.మోహన్ మాట్లాడుతూ.. దాదాపు 30 ఏళ్లుగా ఈ రహదారి నిర్మాణంపై ప్రభుత్వాలు దృష్టి పెట్టడం లేదని వాపోయారు. రహదారి సక్రమంగా లేకపోవడం వల్ల ప్రజలు బస్సు ప్రయాణాలకు దూరమయ్యారన్నారు. ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాధవ కృష్ణయ్య, గుంటప్ప, రంగడు, రామాంజనేయులు, రమేష్, మహేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్ట్



నాటు సారాను అమ్ముతున్న మహిళలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కోడుమూరు: వెల్దుర్తి మండలంలోని బోయిన పల్లి గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న బోయ సాలమ్మ, ఈడిగ శివమ్మ అనే ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ శ్యాంప్రసాద్ బుధవారం తెలిపారు. బోయినపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని నిందితులను ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కూలీలకు పనులు కల్పించండి



ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీడీ అల్లిపీరన్

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో కూలీలకు పనులు కల్పించేందుకు ఉపాధి సిబ్బంది దృష్టి సారించాలని డ్వామా ఏపీడీ అల్లిపీరన్ అన్నారు. బుధవారం ఆయన సి.బెళగల్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, ఉపాధి పనుల కల్పన పురోగతిపై చర్చించారు. గ్రామాలలో గుర్తించిన పనులను ఇకపై ప్రతి రోజు కూలీలకు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతిరోజు పల్లెల్లో సాయంకాలం గ్రామ సభలను నిర్వహించి ప్రజలకు ఉపాధి పనులపై అవగాహన కల్పించి వలస వెళ్లకుండా చూసుకోవాలని ఏపీఓ లక్ష్మన్న, ఈసీ పృథ్వీ, టీఏలను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంటీసీ వితేంద్రరెడ్డి, ఎఫ్ఏలు, సీనియర్ మేట్లు ఉన్నారు.

తప్పిన పెను ప్రమాదం



దెబ్బతిన్న కారు

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని ఎస్సార్బీసీ ప్రధాన కాల్వ వద్ద రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం కాల్వ వద్ద ముందు వెళ్తున్న టిప్పర్ ఉన్నట్టుండి కుడివైపు తిరగడంతో వెనుక వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో ఎవ్వరికి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కారును, టిప్పర్‌ను రోడ్డుపై నుంచి తొలగించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఈర్లదిన్నెలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులన పర్యవేక్షించారు. స్థానిక సమస్యలు, గ్రామంలో డెంగీ అనుమానిత వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో పరిశుభ్రత చర్యలను చేపట్టాలని సర్పంచ్ పెద్దక్కకు సూచించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ డ్రైనేజీల నిర్మాణాలను పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆయన వెంట గ్రామ సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

హామీలన్నీ నెరవేర్చారు జగనన్న

- 'గడప గడప'లో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్



గీతాముఖర్జీనగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: ' గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను నెరవేర్చారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. రాష్ట్రాన్ని మరెంతో అభివృద్ధి చేయడంతోపాటు ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా ప్రజలందరూ జగనన్నకు అండగా నిలిచి మరోసారి సీఎంగా గెలిపించాలని' ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. బుధవారం పట్టణంలోని పడమర బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. మూడున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని తెలియజేసి లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా, పథకాలు అందనివారు ఎవరైనా ఉన్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. ప్రజలు విన్నవించుకున్న సమస్యలను ఆలకించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ వచ్చాక ప్రభుత్వ పాలన ప్రజల వద్దకే వచ్చిందని, సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్సీపీ పట్టణ కమిటీ కన్వీనర్ జే.ఆబేలు, సచివాలయాల కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఖలీలు, కళామ్, దస్తగిరి, మదార్ సాబ్, కుమార్, కిషోర్, మద్ది, విజయుడు, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఏ జిలానీ, నాయకులు సత్యాలు, పత్తి రంగడు, ప్రతాప్, చికెన్ వలి, కరీం, మోదిన్, ఖాదర్, క్రాంతిగౌడ్, మున్సిపల్ ఏఈ నరసింహమూర్తి, మెప్మా టీఎంసీ సూర్యనారాయణ, సచివాలయ సిబ్బది, వలంటీర్లు పాల్గొన్నారు.

38వ వార్డులో 'గడప గడపకు'

కర్నూలు (న్యూటౌన్): గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పథకాల సొమ్ము అంతా తెలుగు తమ్ముళ్ల జేబుల్లోకి వెళ్లేవని, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిధులు పారదర్శకంగా ప్రజల ఖాతాల్లోకి జమ అవుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని 38వ వార్డు గీతాముఖర్జీనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో రాష్ట్రంలోని ప్రజలు సంతోషంగా ఉన్నారని, అందుకే టీడీపీ నేతలు ఆందోళన చెందుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు శేషన్న, ఖాజాబీ, మున్సిపల్ డీఈ షాకీర్‌బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



గణేష్ నగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ బి.వై.రామయ్య

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- 20వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన వారందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 20వ వార్డు 53వ వార్డు సచివాలయం పరిధిలోని బీటీఆర్ నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాలను వివరించారు. వారికి చేకూరిన లబ్ధిని తెలియజేసి బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కాలనీవాసులు తాగునీటి సమస్య పరిష్కరించాలని, డ్రైనేజీలు, రోడ్లు నిర్మించాలని తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, మిద్దె చిట్టెమ్మ, పల్లె శారద, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మికాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, భీమశంకర్‌రెడ్డి, వార్డుల ఇన్‌చార్జ్‌లు శ్రీధర్‌రెడ్డి, బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

- హాజరు కానున్న చిన్న జీయర్ స్వామి

ఓర్వకల్లు: మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో గురువారం నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు నిర్వాహకులు రామమోహన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దాతలు, గ్రామ ప్రజల ఆర్థిక సౌజన్యంతో శ్రీభూనిలా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉదయం 10.50 గంటలకు జరిగే కార్యక్రమానికి శ్రీత్రిదండి శ్రీరామన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఆయన చేతుల మీదుగా ఆలయ నిర్మాణానికి శంకుస్థాపనం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యువకుడి బలవన్మరణం



మృతి చెందిన రాజేష్(ఫైల్)

ఓర్వకల్లు: కడుపు నొప్పి తాళలేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలోని మీదివేముల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ టోపి రామాంజనేయులు, శివమ్మ దంపతులకు కల్యాణ్, రాజేష్(20)లు సంతానం. భార్యాభర్తలు ఇద్దరు వ్యవసాయ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవారు. ఈ క్రమంలో 10 ఏళ్ల క్రితం రామాంజనేయులు హంద్రీనీవా ప్రాజెక్టు పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందారు. అప్పటి నుంచి భార్య శివమ్మ కూలీ పనులకు వెళ్లి కుమారులను చదివిస్తోంది. చిన్న కుమారుడు రాజేష్ డిగ్రీ మధ్యలోనే చదువును ఆపేశాడు. కాగా ఇతను గత కొంతకాలం నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేవారు. ఎన్నిసార్లు వైద్యుల వద్ద చూపించినా ఆరోగ్యం కుదటపడక పోవడంతో మనస్తాపానికి గురై ఉదయం ఇంటి పైకప్పుకు గల కొక్కానికి తాడుతో ఉరేసుకున్నాడు. ఉపాధి పనులకు వెళ్లిన కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారించుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు.

ఈ–కేవైసీ పూర్తి చేయాలి



ఉద్యోగుల హాజరు రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ భాస్కర్ నాయుడు

కర్నూలు (న్యూటౌన్): వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించి రైతులతో ఈ–కేవైసీ పూర్తి చేయాలని కర్నూలు మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.భాస్కర్ నాయుడు పంచాయతీ కార్యదర్శి బసిరున్‌బీని ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, మూమెంట్ రిజిష్టర్లు, విజిటర్స్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్ రైతు భరోసాకు సంబంధించి రైతుల నుంచి ఈ–కేవైసీ తప్పకుండా చేయించాలన్నారు. జగనన్న చేదోడుకు సంబంధించిన దరఖాస్తును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కర్నూలు మండల ఈఓఆర్డీ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ2 నెహేమ్యా, పీఎస్ బసిరున్‌బీ తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను పెంపొందించాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంతో భూగర్భ జాలలను పెంపొందించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సోమయాజులపల్లె చెరువులో ఉపాధి హామీ పథకంలో భాగంగా అమృత సరోవర్ కింద చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నిరుపయోగంగా ఉన్న చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పూడికతీత, చెరువు కట్టలను అభివృద్ధి చేయడం ద్వారా భూగర్భజాలాలు పెరగడమేగాక, పశువుల తాగునీటి కోసం దోహదపడుతాయని అభిప్రాయపడ్డారు. అనంతరం కూలీల హాజరు పట్టికను పరిశీలించి, పనులను నాణ్యతగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధువెంకటకృష్ణ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



సి.బెళగల్‌లో ఓటరు దినోత్సవం నిర్వహిస్తున్న అధికారులు.



పాణ్యంలో మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి

సి.బెళగల్: ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొంతల మునెప్ప అన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, బీఎల్వోలు జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, గ్రామ సర్పంచ్ పాండురంగన్న హాజరై మాట్లాడారు. అనంతరం సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు తదితరులు నూతన ఓటర్లకు మంజూరైన ఓటరు గుర్తింపు కార్డులను అందచేసి, ఉత్తమ బీఎల్వోలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, డీటీ సరళ, ఆర్ఐ సౌమ్య, ఎంఈఓ జ్యోతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి, వీఆర్వోలు శేఖర్, నాగమ్మ, సాయిరమణ తదితరులు ఉన్నారు.

పాణ్యం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఓటు హక్కు గొప్ప అవకాశమన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లైన ఓబులరెడ్డి, నాగేంద్రప్ప, వెంకట్‌రెడ్డిను సన్మానించారు. అంతేగాక కొత్తగా ఓటుకు దరఖాస్తులను తీసుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ అనురాధ, ఆర్ఐ మహేశ్వరెడ్డి, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని డిప్యూటీ తహసీల్దార్ గీతా ప్రియదర్శిణి అన్నారు. బుధవారం పట్టణంలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా జరిగింది. రెవెన్యూ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వైకేపీ సమావేశ హాలులో జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఓటర్ మిన్నెల్లను సత్కరించారు. వ్యాస రచన, వకృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎల్.వెంకటేశ్వర్లు, డి.సుందరరాజు, కెవీ గజేంద్ర



సీనియర్ ఓటర్ మిన్నెల్లను సత్కరిస్తున్న దృశ్యం

గోపాల్, తులసీ కృష్ణ, ఎస్ఈ భాస్కర్, ఎంఈఓ సునీలమ్మ, మండల పరిషత్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరెడ్డి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతి!

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని పాత బస్టాండ్ సర్కిల్ వెలుగోడు ప్రధాన రహదారిలలో గుంత ప్రమాదకరంగా మారింది. రోడ్డు దెబ్బతినడంతో అక్కడ గుంత పడింది. ఆ రోడ్డు వెంట నిత్యం వాహనాలు తిరుగుతుంటాయి. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదం చోటు చేసుకుంటుంది. ఇప్పటికే గుంతలో పడి పలువురు గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



గడివేములలోని పాతబస్టాండ్ ప్రధాన రహదారిపై గుంత పడిన దృశ్యం

చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయాలి

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని, అవి వారికి ప్రాణ రక్షణగా నిలుస్తాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆరోగ్యకేంద్రంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. అప్పుడే జన్మించిన బిడ్డ నుంచి టీకాలు వేసే పద్ధతిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులకు తమ శిశువుకు వయస్సు వారీగా వ్యాక్సిన్ షెడ్యూల్ ప్రకారం ఏఏ రకాల వ్యాధినిరోధక టీకాలు ఇవ్వాలనే విషయాలు కచ్చితంగా తెలిసి ఉండాలని చెప్పారు. అప్పుడే జన్మించిన బిడ్డకు 24 గంటల్లోపు వేసే టీకాల వల్ల క్షయ, పోలియో, హెపటైటిస్–బి వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్. నాగరాజు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళావేదిక వసతి కల్పించాలి

కర్నూలు కల్చరల్: కర్నూలు జిల్లా రంగ స్థలం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రంగస్థల కళాకారులకు కళావేదిక వసతి కల్పించాలని కోరుతూ కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం అధ్యక్షులు గుర్రపుసాల అంకయ్య, సమితి ప్రధాన కార్యదర్శి హనుమంతరావు చౌదరి, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు సయ్యద్ రోషన్ అలీ, ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్, మధుర కవి ఎలమర్తి రమణయ్య ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య
- 19, 20వ వార్డులలో రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: నగరంలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19, 20వ వార్డులలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 19వ వార్డులో రూ.70 లక్షలతో శ్రీవారి కుటీర్ నుంచి వెంకటాద్రి నగర్ సబ్ స్టేషన్ వరకు డిస్పోజల్ డ్రైన్ నిర్మాణానికి, 20వ వార్డులో వాసవినగర్, విజయపురి కాలనీలో రూ.30 లక్షలతో డబ్ల్యూ.బీఎం రోడ్డు నిర్మాణానికి, ధనలక్ష్మినగర్‌లో రూ.50 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే, మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగరంలో ప్రజలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవి ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్నాయనన్నారు. ఈ ఏడాది చివరి నాటికి కర్నూలు నగరాన్ని ఆదర్శవంతమైన నగరంగా తీర్చుదిద్దేలా చర్యలు చేపట్టామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఎక్కడ జరగని విధంగా అభివృద్ధి పనులు కేవలం కర్నూలు నగరంలోనే జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మిరెడ్డి, గాజుల శ్వేతారెడ్డి, మిద్దె చిట్టెమ్మ, పల్లె శారద, సంగాల సుదర్శన్‌రెడ్డి, దండు లక్ష్మికాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, నరసింహులు, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, 36వ వార్డు ఇన్‌చార్జ్ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు ఎస్ఈ శేషసాయి, డి.ఈ రవిప్రకాష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

- రోడ్డు ప్రమాదంతో జీవచ్ఛవంలా మారిన భర్త
- వైద్యం ఖర్చులకు అవస్థలు
- కూలీ పనికి వెళ్తే కానీ పూట గడవని పరిస్థితి



భర్త రాఘవేంద్రకు సపర్యలు చేస్తున్నభార్య సువర్ణ

కోడుమూరు: రోడ్డు ప్రమాదం వారి కుటుంబంలో తీవ్ర శోకాన్ని నింపింది. వైద్యం కోసం లక్షలు ఖర్చు చేసినా ఇంటి పెద్ద కోలుకోలేదు. దీంతో జీవచ్ఛవంలా మారిన అతడిని ఇంటికే తెచ్చుకొని అవస్థలు పడుతున్నా ఓ నిరుపేద కుటుంబ దీనగాథ ఇది. వివరాలు...కోడుమూరుకు చెందిన మెకానిక్ రాఘవేంద్ర, సువర్ణలు భార్యభర్తలు. వీరికి సాయిలాస్య, గాయత్రి, విహల్ అనే ముగ్గురు పిల్లలు సంతానం. రాఘవేంద్ర మెకానిక్ పని ద్వారా, భార్య కూలీ పని ద్వారా డబ్బులు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. అయితే గత నవంబర్ 4వ తేదిన రాఘవేంద్ర కోడుమూరు నుంచి కర్నూలుకి వెళ్తుండగా కర్నూలు నుంచి దేవనకొండకు వెళ్తున్న కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. రోజుకు రూ.50 వేల చొప్పున రూ.12 లక్షల వరకు ఖర్చు పెట్టుకున్నారు. అది కూడా రాఘవేంద్ర తండ్రి పుండుకూర శేఖర్ స్టోన్ క్రషర్ దగ్గర జిలెటిన్ స్టిక్స్ పేలుడు ప్రమాదంలో మృతి చెందడంతో ఇన్సూరెన్స్ కింద వచ్చి సొమ్ము ఆ రూ.12 లక్షలు. ఆ డబ్బు మొత్తం ఖర్చు చేసినా రాఘవేంద్ర కోమాలో నుంచి బయటపడలేదు. ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం ఖర్చులకు డబ్బుల్లేకపోవడంతో రాఘవేంద్రను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కొన్ని రోజులపాటు వైద్యం చేయించినా పరిస్థితి మెరుగుపడకపోవడంతో ఆసుపత్రి వైద్యులు రాఘవేంద్రను డిస్చార్జ్ చేశారు.

దాతల కోసం ఎదురు చూపు :

ఎటూ దిక్కుతోచని కుటుంబ సభ్యులు రాఘవేంద్రను ఇంటికి తెచ్చుకొని సేవలు చేస్తున్నారు. మెరుగైన వైద్యం అందించ లేక, జీవచ్ఛంలా ఉన్న తన భర్త పరిస్థితిని చూసి భార్య సువర్ణ కన్నీరుమున్నీరవుతోంది. కూలీ పనికి వెళ్తే గాని పూట గడవని ఆ కుటుంబానికి కష్టాలు చుట్టుముట్టాయి. భర్తకు దగ్గరుండి సపర్యలు చేస్తుండడంతో కూలీ పనులకు వెళ్లేందుకు అవకాశం లేకుండాపోయింది. కారుతో ఢీ కొట్టిన వ్యక్తి కనీసం రాఘవేంద్ర ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి రాకపోగా వైద్యం ఖర్చులకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. మంచాన పడిన రాఘవేంద్రకు రోజూ రూ.300 నుంచి రూ.400 వరకు మందుల ఖర్చు అవుతోంది. దాతలు సాయం చేసి వైద్య ఖర్చుల కోసం ఆదుకోవాలని రాఘవేంద్ర తల్లి రామలక్ష్మీ (బ్యాంకు ఖాతా నంబర్ : 33018074128, ఎస్‌బీఐ, కోడుమూరు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ నంబర్: ఎస్‌బీఐఎన్0002743) వేడుకుంటోంది.